ప్రజాశక్తి
గురువారం 18 జులై 2024
5
విజయనగరం



మధ్యవర్తులను నమ్మొద్దు

ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

విజయనగరం జిల్లాలో డిసిపిఒ సెక్షన్‌కు సంబంధించి 23 పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైందని ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ బి.శాంతకుమారి తెలిపారు. రాజ్‌కుమార్ అనే వ్యక్తి మెరిట్‌లో ఉన్న వాళ్లకు ఫోన్ చేసి, ఈ పోస్టులు ఇప్పిస్తామని రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు అడుగుతున్నాడని, డబ్బులు ఎవరికీ ఇవ్వవద్దని కోరారు. అపాయింట్మెంట్ ఆర్డర్ ఇస్తామని, మీ మెయిల్ ఐడి ఫార్వర్డ్ చేయాలన్నా చేయొద్దని సూచించారు. మధ్యవర్తులను నమ్మొద్దని అభ్యర్థులకు విజ్ఞప్తిచేశారు.



కాలువను ఆక్రమించి బంకులోకి వెళ్లేందుకు నిర్మించిన రహదారి

- పోలిపల్లి వద్ద జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఓ భారీ లేఅవుట్ కోసం సాగునీటి కాలువను ఆక్రమించి, రహదారి ఏర్పాటుచేశారు. దీనివల్ల పోలిపల్లి గ్రామానికి దిగువున ఉన్న సుమారు 500 ఎకరాలకు పైగా వెళ్లాల్సిన సాగునీటికి గండిపడింది.
- గూడెపువలస రెవెన్యూలోని దల్లిపేట వద్ద ఓ పేరొందిన రియల్ ఎస్టేట్ సంస్థ ఏకంగా ఓ కాలువను మూసేసింది.

సాగునీటికి 'రియల్' బెడద

- భోగాపురంలో విచ్చలవిడిగా కాలువల ఆక్రమణలు
- కబ్జాలపై జెడ్‌పి సమావేశంలో ప్రశ్నించిన ఎమ్మెల్యే
- గ్రామసభల్లో అధికారులను నిలదీసిన రైతులు
- చోద్యం చూస్తున్న అధికారులు
- ఆందోళనలో అన్నదాతలు

అసలే వర్షాకాలం.. వానలొస్తే వచ్చే వరద నీరు సాగునీటి కాల్వల్లో నుంచి పొలాలకు, గెడ్డలకు అక్కడ నుంచి సముద్రానికి వెళ్తుంది. కాని అలాంటి సాగునీటి కాలువలను కొంతమంది లేఅవుట్ యజమానులు, ఇంకొంతమంది అక్రమార్కులు మూసేస్తున్నారు. 15 అడుగుల కాలువలు మూణ్నాలుగు అడుగులకు కుచించుకుపోతున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు చోద్యం చూసున్నారు. ఇటీవలి జిల్లా పరిషత్తు సమావేశంలో ఎమ్మెల్యే లోకం మాధవి లేఅవుట్ల ఆక్రమణలో ఉన్న కాలువలను తొలగించాలని సూచించారు. భోగాపురం పంచాయతీ గ్రామ సభలో చాలామంది రైతులు హైవేకు ఆనుకుని ఉన్న ఓ పెట్రోల్ బంకు యజమాని కాలువ ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కానీ అధికారుల్లో చలనం లేకపోవడం విశేషం.



నీరు వెళ్లేందుకు అవకాశం లేకుండా పూడుకుపోయిన కాలువ

ప్రజాశక్తి-భోగాపురం

అంతర్జాతీయ విమానాశ్రయం.. భోగాపురం ప్రాంత రూపురేఖలు మార్చిన పేరిది. విమానాశ్రయ ప్రకటనతో ఒక్కసారిగా మండలంలోని భూములకు డిమాండ్ ఏర్పడింది. భూముల ధరలకు భారీగా రెక్కలొచ్చాయి. అదే సమయంలో ఎన్నడూ లేనివిధంగా, జిల్లాలో మరెక్కడా చూడని విధంగా లేఅవుట్లు ఏర్పాటయ్యాయి. ఇంకా ఏర్పాటు అవుతూనే ఉన్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.. లేఅవుట్ల ఏర్పాటు, ఇతర నిర్మాణాల్లో ప్రభుత్వ భూములు, చెరువులు, కాలువలు ఆక్రమణకు గురవుతున్నాయి. లేఅవుట్ల ఏర్పాటులో కాలువలను పూడ్చివేసి ఏకంగా పార్కులకు వినియోగిస్తున్నారు. మరికొన్ని చోట్ల ఏకంగా పది అడుగుల కాలువ ఉంటే దాన్ని మూడు అడుగులకే పరిమితం చేసి మిగతా దానిని కప్పేస్తున్నారు. మండలంలో ఎక్కడికక్కడ ఈ ఆక్రమణల పర్వం సాగుతున్నా అధికారులు మాత్రం చర్యలకు ఉపక్రమించడం లేదు.

భోగాపురం సమీపంలోని జాతీయ రహదారిపై కొత్తగా ఆరు నెలల కిందట పెట్రోల్ బంకును ఏర్పాటు చేశారు. జాతీయరహదారికి ఆనుకొని పొలాలకు సాగునీరు వెళ్లేందుకు సుమారు 15 అడుగుల కాలువ ఉంది. ఈ పెట్రోల్ బంకు యజమానితో పాటు పక్కనే ఉన్న మరో కంపెనీ యజమాని ఏకంగా ఈ కాలువను కుదించేశారు. 15 అడుగులు ఉండాల్సిన కాలువను ఏకంగా నాలుగు అడుగులకు పరిమితం చేశారు. అప్పట్లో రైతులు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు పట్టించేకోలేదు. దీంతో కాలువ నుంచి నీరు వెళ్లే పరిస్థితి లేదు. ఏకంగా సాగునీటి కాలువ మూసుకుపోయినా పట్టించుకునేవారు లేరు. సుమారు నాలుగు నెలల కిందట జరిగిన గ్రామసభలోనూ దీనిపై చర్చ జరిగింది. ఇటీవల జరిగిన గ్రామసభలోనూ చాలామంది దీనిపై అధికారులను నిలదీశారు. కాని అధికారులు మాత్రం కనీసం నోటీసు కూడా వారికి ఇవ్వకపోవడం విశేషం. ఈ బంకు యజమానికి కొంత మంది వ్యక్తులు కొమ్ముకాశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాగునీటి కాలువలు కప్పేస్తున్నా సరే మరి అధికార యంత్రాంగం ఏంచేస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది.

లే అవుట్లలోనూ ఆక్రమణలే

ఇలాంటిదే భోగాపురం గ్రామంలోని జాతీయరహదారిని ఆనుకుని ఈ పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న ఓ లేఅవుట్‌లో భారీ కాలువను కప్పేసి చిన్న కాలువను చేసేసి, దానిపై పలకలు వేయడం విశేషం. గ్రామంలోని బట్టికాలువ పొంగి ప్రవహిస్తే ఎస్‌సి కాలనీ వద్దనున్న చప్టా ద్వారా నీరు ఈ కాలువ నుంచి జాతీయరహదారిలోనున్న కాలువలోకి చేరుతుంది. ఇప్పుడు కాలువ చిన్నది కావడంతో ఒకవేళ పైనుంచి ఉధృతంగా నీరు వస్తే పొలాలపై నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన జిందాల్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పిగా వకుల్ జిందాల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరం జిల్లాకు ఆనుకొని ఏజెన్సీ ప్రాంత జిల్లాలు, ఒడిశ్శా సరిహద్దు రాష్ట్రంగా ఉండడం వల్ల గంజాయి రవాణాకు ఆస్కారం ఉందని, అందులో ప్రధాన వ్యక్తులను, వాటి మూలాలను గుర్తించి, కఠిన చర్యలు చేపడతామని తెలిపారు. త్వరలో గంజాయి రవాణా కేసులను సమీక్షించి, వ్యూహ రచన చేసి, అడ్డుకట్ట వేస్తామని ప్రకటించారు. మహిళల భద్రత, రక్షణకు, పోలీసు సిబ్బంది సంక్షేమానికి, ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు, సైబర్ నేరాల నియంత్రణకు ప్రాధాన్యత కల్పిస్తానని తెలిపారు. తొలుత వకుల్ జిందాల్.. పైడితల్లమ్మ ఆలయాన్ని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎస్‌పికి అదనపు ఎస్‌పి అస్మాఫర్హీన్, ఎఆర్ అదనపు ఎస్‌పి ఎం.ఎం.సోల్మన్, డిఎస్‌పిలు ఆర్.గోవిందరావు, పి.శ్రీనివాసరావు, ఎ.ఎస్.చక్రవర్తి, ట్రాఫిక్ డిఎస్‌పి డి.విశ్వనాద్, డిటిసి డిఎస్‌పి వీరకుమార్, ఎఆర్ డిఎస్‌పి యూనివర్స్, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.



ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరిస్తున్న వకుల్ జిందాల్

కలెక్టర్‌ను కలిసిన ఎస్‌పి

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను ఎస్‌పి వకుల్ జిందాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లాలోని పరిస్థితులపై ఇరువురు చర్చించారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన వకుల్ జిందాల్.. జిల్లాలో పని చేస్తున్న పోలీసు అధికారులతో ఎస్‌పి కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం సమావేశమై, అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రతీ పోలీసుస్టేషను పరిధిలో విధిగా విజిబుల్ పోలీసింగు చేపట్టాలని, ప్రజలతో మమేకమై, చట్ట సంబంధ విషయాలపై అవగాహన కల్పించాలని సూచించారు. గంజాయి రవాణా నియంత్రణకు ప్రాధాన్యతనివ్వాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే రౌడీషీట్లు, చెడు నడత కలిగిన వ్యక్తుల చర్యలపై ఉక్కుపాదం మోపాలన్నారు.

బాలికలపై దాడులకు వ్యతిరేకంగా

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన బుధవారం నగరంలోని కోట జంక్షన్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో, రాష్ట్రంలో మహిళలపై దాడులు మరింత పెరిగాయని ఆందోళన వ్యక్తంచేశారు. విరివిగా లభ్యమవుతున్న గంజాయి, డ్రగ్స్ పదార్థాలే అందుకు కారణమని, తక్షణమే వీటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. నంద్యాల జిల్లాలో తొమ్మిదేళ్ల బాలికను అత్యాచారం చేసి, చంపేసిన బాలురు ఏ వెబ్‌సైట్లు చూశారో అటువంటి వాటిని తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, కాగితాలకే పరిమితమైన దిశ, నిర్భయ, పోక్సో చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా సాధికారత సాధిస్తామని చెప్తున్నా రాష్ట్ర ప్రభుత్వం గత నెల రోజులుగా మహిళలపై ఇన్ని దారుణాలు జరుగుతున్నా కనీసం స్పందించకపోవడం సిగ్గుచేటని, ఇది మహిళా లోకాన్ని కించపరచడమేనని ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ సమీరా విమర్శించారు. వెంటనే ప్రభుత్వం స్పందించకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు చిన్నబాబు, జె.రవికుమార్, జగదీష్, నగర అధ్యక్ష, కార్యదర్శులు రాజు, పి రమేష్, జిల్లా కమిటీ సభ్యులు వంశీ, సుస్మిత, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

టిడ్కో.. ఎప్పటికో?

- పూర్తికాని మౌలిక వసతులు
- తాళాలు ఇచ్చి చేతులు దులుపుకున్న గత పాలకులు
- పెచ్చులూడుతున్న నిర్మాణాలు
- ఈ ప్రభుత్వంలోనైనా పూర్తి సౌకర్యాలు కపించేనా?

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తాంబూలాలు ఇచ్చాం.. తన్నుకు చావండి అన్న చందంగా టిడ్కో ఇళ్ల విషయంలో గత వైసిపి పాలకులు వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎపి టిడ్కో) గృహ లబ్ధిదారులకు రుణాల మంజూరు, జి ప్లస్ త్రీ గృహాలు నిర్మించిన కాలనీల్లో మౌలిక వసతుల కల్పనలో తీవ్ర జాప్యం సాగుతోంది. ఎన్నికల ముందు లబ్ధిదారులకు తాళాలు ఇచ్చారు తప్ప మౌలిక సదుపాయాలు కల్పించడంలో గత పాలకులు విఫలమయ్యారు. 'ఇప్పుడు ఇస్తాం, అప్పుడు ఇస్తాం' అంటూ వాయిదాల మీద వాయిదాలు వేసి ఎన్నికల ముందు ఓట్ల కోసం హడావుడి చేసి తాళాలు ఇచ్చారు. అంతే తప్ప వినియోగానికి ఉపయోగపడేలా మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమయ్యారు. నిర్మాణాలు పూర్తయిన కొన్నిళ్లు శిథిల నివాసాల మాదిరిగా తయారవుతున్నాయి. కిటికీలు చెదలు పట్టి, తలుపు పగిలిపోయి, రూఫ్‌లు పెచ్చులూడిపోయి దర్శనమిస్తున్నాయి. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన టిడ్కో ఇళ్ల నిర్మాణాలు వైసిపి ప్రభుత్వం వచ్చి ఐదేళ్లు పూర్తయినా ఇళ్ల తాళాలు ఇచ్చారు తప్ప వినియోగానికి పనికి రాని విధంగా ఉన్నాయి.

నత్తనడకన మౌలిక వసతుల పనులు

విజయనగరం కార్పొరేషన్‌లో సారిపల్లి వద్ద 2656, సోనినగర్ వద్ద 1320 టిడ్కో ఇళ్లను గత టిడిపి ప్రభుత్వ హయాంలో మంజూరు చేసింది. ఇళ్ల నిర్మాణ పనులకు టెండర్లు పిలిచింది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఈ గృహ నిర్మాణ పనులు కొనసాగించింది. ఈ గృహాల నిర్మాణాలను పూర్తి చేసి రంగులద్దింది. రోడ్లు, యుజిడి, సీవేజి ట్రీట్మెంట్ ప్లాంట్లు (ఎస్‌టిపి, మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకులు, వాటర్ పైపులైన్లు, విద్యుద్దీపాలు వంటివి ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రోడ్లకు సంబంధించి పనులను అసలు ప్రారంభించలేదు. యుజిడి మంచినీటి వ్యవస్థలను కూడా ఏర్పాటు చేయలేదు. విద్యుత్తు శాఖ నుంచి స్తంభాలు, లైన్లు ఏర్పాటు చేయలేదు. కేవలం ఒక్క లైను మాత్రమే విద్యుత్తు స్తంభాలు వేశారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లకు ఇంకా విద్యుత్ కనెక్షను ఇవ్వలేదు.

లబ్ధిదారుల్లో ఆందోళన

నగరంలో అద్దెల భారాన్ని తగ్గించుకునేందుకు సొంతింటి కల నెరవేర్చుకోవడానికి ఈ పథకంలోని లబ్ధిదారులు అప్పులు చేసి వేలాది రూపాయలు డిపాజిట్లు చెల్లించారు. కానీ దాదాపు ఆరేళ్లు అయినా ఇప్పటికీ వారికి ఇల్లు అందుబాటులోకి రాలేదు. దీంతో ఇంటి అద్దెలతోపాటు చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎప్పటికి ఇల్లు పూర్తి చేసి ఇస్తారో అని ఎదురు చూస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో తాళాలు ఇచ్చి వైసిపి పాలకులు చేతులు దులుపుకున్నారు. నేడు అధికారంలోకి వచ్చిన కూటమి పాలకులైనా టిడ్కో ఇళు పూర్తి చేసి ఇస్తారో లేదో వేచి చూడాల్సిందే.




సారికలో టిడ్కో ఇళ్ల వద్ద కొనసాగుతున్న పనులు

ముందస్తు డిపాజిట్లు

లబ్ధిదారుల నుంచి ముందస్తు డిపాజిట్లు తీసుకుంది. ఈ పథకం కింద లబ్ధిదారులకు కేంద్రం ప్రభుత్వం రూ.1.50 లక్షల రాయితీ అందజేస్తోంది. ప్రభుత్వం మూడు కేటగిరీల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టింది. ఎ-కేటగిరీ (300 చదరపు అడుగులు), బి- కేటగిరీ (364 చదరపు అడుగులు), సి- కేటగిరీ (430 చదరపు అడుగులు) విస్తీర్ణంలో నిర్మించారు. ఎ-కేటగిరీలోని ఇళ్లను లబ్దిదారులకు ప్రభుత్వం ఉచితంగానే రిజిస్ట్రేషన్లు చేసింది. బి కేటగిరీ గృహ నిర్మాణానికి రూ.7.65 లక్షలు ఖర్చవుతోంది. లబ్ధిదారుల వాటాగా రూ.50 వేలు చెల్లించారు. సి-కేటగిరీకి రూ.8.65 లక్షలు ఖర్చవుతోంది. రూ.లక్ష లబ్ధిదారుని వాటాగా చెల్లించారు. ఈ రెండు కేటగిరీల్లోని లబ్ధిదారులు చెల్లించగా, మిగిలిన మొత్తాన్ని బ్యాంకుల ద్వారా రుణాలు సమకూర్చుకుని టిడ్కో సంస్థకు చెల్లించారు.

పంతాలకు పోతే పట్టు కోల్పోయినట్టే

మంత్రికి సవాలుగా మారిన చంద్రబాబు హితబోధ



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రి అంటే ఆ శాఖ వరకు సిఎం తరువాత ఆయనే సుపీరియర్. కానీ, అది రాజ్యాంగానికి, ప్రభుత్వ నిర్ణయాలకు, అధినేత ఆదేశాలకు లోబడి ఉండాలి. వీటిని అతిక్రమిస్తే ప్రభుత్వానికే చెడ్డపేరు. బహుశా అందుకేనేమో సిఎం చంద్రబాబు ఇటీవల జరిగిన మంత్రి మండలి సమావేశంలో మంత్రులకు క్లాస్ తీసుకున్నారు. నెల రోజుల పనితీరును సమీక్షిస్తూ ముగ్గురు మంత్రులు బాగా పనిచేసినట్టుగా ప్రకటించారు. అందులో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన మంత్రులు లేరు. ఈ సంగతి అటుంచితే మంత్రులకు సిఎం పలు అంశాలపై దిశానిర్దేశం చేసిన విషయం తెలిసిందే. ఇందులో ముఖ్యంగా ఎమ్మెల్యేలతో పంతాలకు పోవద్దని, వారిని సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. దీని అమలు విజయనగరం జిల్లాలో ఏమేరకు ఉంటుందోనన్న చర్చ నడుస్తోంది. ఇందుకు కారణం లేకపోలేదు. రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వయసులోనే కాదు, మిగిలిన ఎమ్మెల్యేలు, ఎమ్‌పితో పోలిస్తే రాజకీయంగానూ కొత్తే. సామాజిక సమీకరణాల నేపథ్యంలో అనుహ్యంగా మంత్రి పదవి వరించింది. ఆశావహుల్లో కొంత నిరాశ ఉన్నప్పటికీ అధినేత ఆజ్ఞకు కట్టుబడి మిన్నకుండిపోయారు. ఇటువంటి పరిస్థితుల్లో మంత్రి కొండపల్లి అందరినీ కలుపుకుని ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించాలి. కానీ, అధికారుల బదిలీల విషయంలో అటువంటి అవకాశాలు ఇవ్వడం లేదన్నది ఎమ్‌పి, ఎమ్మెల్యేల ముఖ్య అనుచరుల్లో వినిపిస్తున్న మాట. ఈ విషయం ఇప్పటికి బహిరంగంగా చర్చ కాకున్నా, పరిస్థితి ఇలాగే ఉంటే భవిష్యత్తులో రచ్చకెక్కే అవకాశాలు లేకపోలేదని పలువురు విశ్లేషిస్తున్నారు. శాఖా పరమైన సమస్యలపై గానీ, బదిలీల విషయంలో గానీ అందరికీ నేరుగా మంత్రిని కలిసే అవకాశం రాకపోవచ్చు. మంత్రికి కూడా అధికారులందరికీ అపాయింట్‌మెంట్లు ఇవ్వకపోవడం సాధ్యం కాకపోవచ్చు. ఈ నేపథ్యంలో అధికారులు ఎమ్మెల్యేల సిఫార్సులతో ప్రయత్నించడం సర్వసాధారణం. అనేక నిర్ణయాలు మంత్రి కనుసన్నల్లో తీసుకోవాల్సి ఉన్నా, నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేకు స్వేచ్ఛనివ్వాల్సిన అవసరం ఉంది. అయితే, ఇప్పటి వరకు మన జిల్లాల్లో అటువంటి స్వేచ్ఛకు భంగం కలిగించే వరకు వెళ్లలేదని చెప్పుకోవచ్చు. మరోవైపు ఇసుక విషయంలో జోక్యం చేసుకోవద్దని బాబు చేసిన సూచన కూడా మంత్రికి కత్తిమీద సామే. జిల్లాలో ఏళ్ల తరబడి ఇసుక మాఫియా నడుస్తోంది. దీని వెనుక రాజకీయ నాయకుల ఒత్తిళ్లు, ప్రయోజనాలు ఉన్నాయి. మంత్రి తలదూర్చకపోయినా, అక్రమ తవ్వకాలు, విక్రయాలకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత మంత్రిదే. ఈ విషయంలో మంత్రి ఎలా వ్యవహరిస్తారో? అన్న దానిపై జిల్లాల్లో చర్చ నడుస్తోంది. ఇక శాఖలపై పట్టు సాధించాలన్న అధినేత సూచన విషయానికి వస్తే మంత్రి కొండపల్లి అదే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే ఢిల్లీ వెళ్లి ఎంఎస్ఎంఇ కేంద్ర సహాయ మంత్రిని కలిశారు. సంబంధిత శాఖ మంత్రిగా పించన్ల పంపిణీలో మంచి పనితీరే కనబరిచారు. ఇటు జిల్లాపైనా పట్టుసాధించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. ఎరువులు, రుణాలు రైతులందరికీ అందే విధంగా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాల్సి ఉంది. మరోవైపు వర్షాల కారణంగా జ్వరాలు జృంభిస్తున్నాయి. వీటిని అదుపు చేయడంతోపాటు రోగుల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు వైద్యులను అప్రమత్తం చేయడం, అన్ని ఆసుపత్రుల్లోనూ అన్నిరకాల వైద్యపరీక్షలు, మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇక సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమల స్థాపనపై ప్రత్యేక దృష్టిసారించాల్సి ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

బిఎస్ఎన్ఎల్‌ను కాపాడుకోవడమే

నిజమైన దేశభక్తి

జెవివి జాతీయ ప్రధాన కార్యదర్శి కృష్ణాజీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బిఎస్ఎన్ఎల్‌ను కాపాడుకోవడమే నిజమైన దేశభక్తని జన విజ్ఞాన వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంవిజిఆర్ కృష్ణాజీ తెలిపారు. బుధవారం స్థానిక గురజాడ పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల బెంగళూరులో జరిగిన జాతీయ మహాసభల్లో జాతీయ ప్రధాన కార్యదర్శిగా తనను ఎన్నుకున్నట్లు చెప్పారు. ప్రధానంగా జాతీయ మహాసభల్లో కొన్ని తీర్మానాలు చేశామన్నారు. బిఎస్ఎన్ఎల్ నష్టాలకు కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. 2014 తర్వాత 4జి అనుమతులు జియోకి ఇచ్చారు తప్ప బిఎస్ఎన్ఎల్‌కు ఇవ్వలేదన్నారు. బాబాల పేరుతో ఆశ్రమాలు పెట్టి వేల ఎకరాల భూములు కాజేస్తున్నారని, వాటిని బయట పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలే బాబాలను పెంచి పోషిస్తున్నాయని విమర్శించారు. ఈ సందర్భంగా కృష్ణాజీని వేదిక సభ్యులు సత్కరించారు. సమావేశంలో జెవివి జిల్లా అధ్యక్షులు ఇ.ఆనంద్, యు.శాంతికుమారి జిల్లా ప్రధాన కార్యదర్శి, సురేష్, షణ్ముఖ రావు, డప్పు శ్రీను, అప్పలనాయుడు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై

నేటి నుంచి ఇంటింటి సర్వే


జిల్లా వ్యాప్తంగా 1790 బృందాలు ఏర్పాటు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో గురువారం నుంచి కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ప్రభుత్వం సర్వే చేపడుతుంది. దీనికోసం ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికీ వచ్చి వివరాలను సేకరించనున్నారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా, ఈ నెల 18న ప్రారంభమయ్యే ఈ సర్వే ఆగస్టు రెండో తేది వరకు సాగుతుంది. ప్రతీ ఇంటికి వెళ్లి, ఎవరికైనా కుష్టువ్యాధి లక్షణాలు ఉంటే నమోదు చేసుకుంటారు. దీనికోసం జిల్లా వ్యాప్తంగా 1790 బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ఆశా వర్కర్ లేదా ఎఎన్ఎం, ఒక వాలంటీర్ ఉంటారు. ఈ వ్యాధిని ముందే గుర్తించడం వల్ల సకాలంలో ఎండిటి చికిత్స ద్వారా వ్యాధిని పూర్తిగా నయం చేసే వీలుంది. వ్యాధి వ్యాప్తిని కూడా అరికట్టవచ్చు. ముఖ్యంగా వ్యాధిగ్రస్తులకు అంగవైకల్యం బారినుంచి కాపాడవచ్చు. మైక్రో బాక్టీరియం లెప్రే అన్న బాక్టీరియా ఈ వ్యాధికి కారణం. తుంపర్లు ద్వారా ఒకరి నుంచి మరొకరికి ఈ బాక్టీరియా వ్యాప్తి చెందుతుంది. వారి వ్యాధి నిరోధకతను బట్టి వ్యాధి లక్షణాలు బయట పడేందుకు 3 నుంచి 8 సంవత్సరాలు పడుతుంది.

కుష్టువ్యాధి లక్షణాలు ఇవే

- చర్మంపై స్పర్శ, నొప్పి, దురద లేని మచ్చలు
- చర్మంపై ఎర్రని లేదా రాగి రంగు మచ్చలు
- చెవులపై, వీపుపై, ఎదపై నొప్పిలేని బుడిపెలు
- కనురెప్పలు పూర్తిగా మూయలేకపోవడం
- కనుబొమలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం
- నొప్పిగా ఉన్న నరములు
- చేతులు, పాదాలు, నరాల్లో తిమ్మిర్లు
- అరిచేతులు, పాదాలు స్పర్శ లేకపోవడం, పొడిబారిపోవడం
- చేతులు, పాదాల్లో నొప్పి తెలియని గాయాలు, పుండ్లు
- చేతివేళ్లు, కాలివేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం
- చల్లని, వేడి వస్తువులను గుర్తించలేకపోవడం
- చేతులనుంచి వస్తువులు జారిపోవడం
- మణికట్టు లేదా మడమను పైకి లేపలేకపోవడం
- కాళ్లనుండి చెప్పులు జారిపోవడం



కుష్టు రహిత జిల్లాగా మారుద్దాం : కలెక్టర్ అంబేద్కర్

కుష్టువ్యాధి వ్యాధి రహిత జిల్లాగా విజయనగరాన్ని మారుద్దాం. వ్యాధి వ్యాప్తి చెందకుండా జిల్లాలో అధికారులు అన్ని రకాల నిర్మూలన చర్యలు తీసుకోవాలి. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం ద్వారా వ్యాధిని చాలావరకు అరికట్టవచ్చు. వ్యాధిగ్రస్తులను ముందుగానే గుర్తించవచ్చు. ఇంటింటికి వెళ్లి వ్యాధి లక్షణాలను గుర్తించడంతోపాటు, ప్రతీ పాఠశాలకు వెళ్లి విద్యార్థులను తనిఖీ చేసి, స్పర్శ లేని మచ్చలు, ఇతర లక్షణాలు ఏమైనా ఉంటే గుర్తించాలి. మన ప్రాంతంలోనే ఈ వ్యాది ఎక్కువగా ఉండటానికి తగిన శాస్త్రీయ కారణాలను అన్వేషించాలి. సర్వే కోసం ఇంటివద్దకు వచ్చే ఆశావర్కర్లు, వైద్య సిబ్బందికి ప్రజలు పూర్తిగా సహకరించాలి. కుష్టురహిత జిల్లాగా మార్చేందుకు ప్రజలు సహకారం అందించాలి.



ప్రజాశక్తి
www.prajasakti.com



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సిఇఒ సత్యం

తల్లిదండ్రులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి - విజయనగరం

రామనారాయణం సమీపంలోని భాష్యం బ్లూమ్స్ పాఠశాలలో బుధవారం సిబిఎస్‌ఇ కరిక్యులమ్ పై తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఉత్తరాంధ్ర సిఇఒ సత్యం మాట్లాడుతూ సిబిఎస్‌ఇ విధి విధానాలపై, సిబిఎస్‌ఇలో చదవడం వల్ల కలిగే భవిష్యత్తు ప్రయోజనాలు గురించి వివరించారు. అనంతరం తల్లిదండ్రులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలను నివృత్తి చేశారు. అలాగే విద్యార్థుల ఫిట్‌నెస్ కోసం మాడికరాల విశాల ఆటస్థలం గురించి తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం తల్లిదండ్రులకు ఆటల పోటీలను నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇంచార్జి శివనారాయణ, జెడ్‌టిసిఇ శ్రీదేవి, సిబిఎస్‌ఇ ప్రిన్సిపాల్ ఉషారాణి పాల్గొన్నారు.

ఉన్నతమైన న్యాయ సేవలు అందించాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

సామాన్య ప్రజలకు ఉన్నతమైన, నాణ్యమైన న్యాయ సేవలు అందించేలా న్యాయవాదులు కృషి చేయాలని రోటరీ డిస్ట్రిక్ట్ చైర్మన్ జెసి రాజు అన్నారు. బుధవారం న్యాయవాదుల దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని బొబ్బిలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.మోహన్ మురళి కుమార్‌ను న్యాయవాది అయిన ఆయన సతీమణి లక్ష్మీ దీపవల్లిను రోటరీ క్లబ్ సెక్రటరీ సిహెచ్ జె ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన రోటరీ డిస్ట్రిక్ట్ చైర్ జెసి రాజు, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ చైర్ శ్రీహరి, ఇన్నర్ వీల్ క్లబ్ చైర్ జి.శంకర రావులు న్యాయ దినోత్సవ శుభాకాంక్షలను తెలిపి పుష్పగుచ్ఛాలను అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా చైర్ జెసి రాజు మాట్లాడుతూ శాంతి పెంపొందించుట, ప్రజాస్వామ్య పరిరక్షణ, సమన్యాయం, న్యాయ పరిరక్షణలో న్యాయవాదులు ప్రముఖ పాత్ర వహిస్తారని అన్నారు. పేదలకు సత్వర న్యాయం అందించేలా న్యాయవాదులు కృషి చేయాలని కోరారు.

నేడు గెస్ట్ టీచర్ పోస్టులకు డెమో ఇంటర్వ్యూ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల గెస్ట్ టీచర్ పోస్టులకు ఈ నెల 18న డెమో వాక్ ఇంటర్వ్యూలు జరుగుతాయని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె.ఉషారాణి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో సాంఘిక సంక్షేమ శాఖ విద్యా సంస్థ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో గెస్ట్ టీచర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఇంగ్లీష్, గణితం, జంతుశాస్త్రం, హిందీ, ఎకనామిక్స్, ఫిజికల్ సైన్స్ పోస్టులకు అర్హత కలిగిన పురుష అభ్యర్థులు, తెలుగు, ఇంగ్లీష్, హిందీ, గణితం, ఫిజిక్స్, ఫిజికల్ డైరెక్టర్, స్టాఫ్ నర్స్ ఖాళీ పోస్టులకు ఈ నెల 18న స్థానిక బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాల లో డెమో వాక్ ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. గెస్ట్ టీచర్ పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో పీజీతో పాటు బిఇడి, టెట్ అర్హత కలిగి ఉండాలని, స్టాఫ్ నర్స్ పోస్టులకు జిఎన్‌ఎం, పీడీ పోస్టుకి బిపిఇడితో పాటు ఏదైనా పీజీ, ఎంపిఇడి అర్హత కలిగి ఉండాలన్నారు. ఇతర వివరాలు కోసం జిల్లా సమన్వయ కర్త కార్యాలయం, ఉదా బి ఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాలలో నోటీసు బోర్డులో ఉన్నాయని తెలిపారు. అర్హత ఆసక్తి ఉన్న అభ్యర్థులు ధ్రువ పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

ఖాళీల వివరాలు

కొప్పెర్ల బాలుర పాఠశాలలో 5 జెఎల్ పోస్టులు, పాలకొండ, సాలూరు బాలుర పాఠశాలల్లో ఒక్కో జెఎల్, వేపాడ బాలికల పాఠశాల జెఎల్, పీజీటీ 3, టిజిటి 2, పీడీ 7 పోస్టులు, చిత్యం పేట బాలికల పాఠశాలలో జెఎల్ 1, పీజీటీ 2, వంగర బాలికల పాఠశాలలో జెఎల్ 2, నెల్లిమర్ల బాలికల పాఠశాలలో టిజిటి హిందీ 1, భామిని బాలికల పాఠశాలలో టిజిటి 2 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు.

దశపర్ని కషాయం తయారీ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వావిలపాడులో చెల్లంనాయుడు మాస్టర్ పొలంలో దశపర్ని కషాయం తయారు చేయడంపై వ్యవసాయ సిబ్బంది బుధవారం అవగాహన కల్పించారు. తెగుళ్లను నివారించడానికి ఈ కషాయాన్ని ఒక ట్యాంకుకు 4ఒ లీటర్ చొప్పున కలిపి పంటపై స్ప్రే చేయాలన్నారు. అనంతరం అప్పల నాయుడు పొలంలో వేసిన నవధాన్యా సాగును పరిశీలించారు. రసాయనిక ఎరువులు పురుగుమందులు ఖర్చులు తగ్గించి పంట దిగుబడి పెరిగిందని, నేల గుల్లబారడం, భూమిలో సూక్ష్మ జీవులైన ఎలకు బాగా వృద్ధి చెందడం చూసానని రైతు అప్పలనాయుడు ఈ సందర్భంగా తెలిపారు. తనతో పాటు తన చుట్టూ ఉన్న మరో 15 మంది రైతులు ఇదే పద్ధతిని పాటిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ సన్యాసమ్మ, ఇన్చార్జి రాము, దేవుడు పాల్గొన్నారు.

మైనింగ్ తవ్వకాల పరిశీలన

ప్రజాశక్తి - తెర్లాం



మైనింగ్ తవ్వకాలను పరిశీలిస్తున్న అధికారులు

మండలంలో డి. గదబ వలసలో ఉన్న బ్లూ ఓసిన్ మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం అక్రమ మైనింగ్ తవ్వకాలను తహశీల్దార్ ఆదేశాలతో ఆర్‌ఐ అప్పలరాజు, విఆర్‌ఒ రామయ్య, పోలీస్ సిబ్బంది, స్థానిక సర్పంచ్ జావాన రమేష్ నాయుడు బుధవారం పరిశీలించారు. అక్రమంగా తవ్విన రాళ్ల కుప్పలను డంపింగ్ యార్డ్ పైన, మైనింగ్ అధికారులకు, తహశీల్దార్‌కు ఎలాంటి ఆధారాలు చూపించకపోవడంతో అక్రమ తవ్వకాలు నిలుపుదల చేయాలని ఆదేశించారు. అక్రమంగా తవ్విన రాళ్ల కుప్పలను అనుమతులు లేకుండా తరలించడానికి వీల్లేదని హెచ్చరించారు.

అక్రమ కట్టడాలన్నీ తొలగించండి

తెర్లాం: మండల కేంద్రంలో ఉన్న అక్రమ కట్టడాలన్నీ తొలగించాలని తెర్లాం గ్రామానికి చెందిన చింత వెంకటేష్ తహశీల్దార్, ఎంపిడిఒకు బుధవారం ఫిర్యాదు చేశారు. తన ఇంటికి తూర్పు భాగంలో ఉన్న కాలువ ద్వారా పాములు, కప్పలు, వ్యర్థ పదార్థాలు తమ వీధిలో వారు తెచ్చిన చెత్త చెదారం వేస్తున్నారని, దాని వల్ల తమ కుటుంబం అనారోగ్యానికి గురవుతున్నామని చెప్పారు. దానిని ప్రభుత్వ ఆస్తిని కబ్జా చేసి తూర్పు భాగాన కాలువపై నిర్మాణాన్ని చేశారని, దానిని తొలగించాలని అధికారులకు కొంత మంది ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. తక్షణమే కట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేటి నుంచి గ్రామాల్లో కుష్టువ్యాధి సర్వే

ప్రజాశక్తి - రేగిడి

ఈ నెల 18 నుంచి ఆగస్టు 2 వరకు కుష్టువ్యాధి సర్వే నిర్వహించాలని వైద్యాధికారులు డాక్టర్ ఎస్. చలమయ్య, డాక్టర్ దీనా చౌదరి సూచించారు. బూరాడ పిహెచ్‌సిలో బుధవారం ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పిల పర్యవేక్షకులకు కుష్టువ్యాధి గ్రస్తులను గుర్తించే కార్యక్రమంపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో సర్వే చేసి కుష్టువ్యాధి లక్షణాలను వారిని గుర్తించాలన్నారు. అనంతరం బూరాడ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ రాధాకృష్ణ, పిహెచ్ఎన్ సావిత్రి, సూపర్‌వైజర్లు సాయికృష్ణ, లక్ష్మి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు హెల్మెట్ వినియోగంపై ర్యాలీ

బొబ్బిలి: హెల్మెట్ వినియోగంపై గురువారం ర్యాలీ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ చెప్పారు. హెల్మెట్ లేకుండా వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలలో తీవ్రంగా గాయపడి మృతి చెందుతున్నారని, హెల్మెట్ వినియోగం వల్ల కలిగే లాభాలపై వాహనదారులకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహిస్తున్నామని చెప్పారు. ర్యాలీను జయప్రదం చేయాలని ఆమె కోరారు.

నేడు అక్కివరంలో గ్రామ సందర్శన

డెంకాడ: మండలంలోని అక్కివరంలో గురువారం గ్రామసందర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ లవరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాటు మండల స్థాయి అన్ని శాఖల అధికారులు గ్రామాన్ని సందర్శించి గ్రామంలో ఉన్న సమస్యలను తెలుసు కొంటారన్నారు. గ్రామంలో ప్రభుత్వ ఆఫీసులో నడుస్తున్న వాటిపనితీరుని అధికారులు పరిశీలిస్తారన్నారు. కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశాల ప్రకారం ప్రతి గురువారం ఏదో ఒక గ్రామంలో గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించనున్నామని చెప్పారు.

ఘనంగా ఏకలవ్య జయంతి

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని ఎరుకులపాకలో గ్రామంలో బుధవారం ఏకలవ్యని జయంతి వేడుక ఎంపిటిసి పాలవలస గౌరు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎపి ఎరుకల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాలపర్తి శ్రీనివాసరావు హాజరై ఏకలవ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా



బాడంగి: ఏకలవ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న గౌరు, పార్వతి

పాలవలస గౌరి మాట్లాడుతూ మహాభారతంలో తమ ఎరుకుల జాతి మూల పురుషుడు ఏకలవ్యని చరిత్ర ఒక ప్రత్యేకమైన గుర్తింపు కలిగిందన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో, నీతి నిజాయితీకి మారుపేరుగా నిలిచి తన గురువు ద్రోణాచార్యునికి ఏకలవ్యుని బొటనవేలు గురుదక్షిణగా సమర్పించిన వ్యక్తి అని కొనియాడారు. నేటి తరానికి ఆయన చూపించిన మార్గం ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పార్వతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొత్తవలస: ఏకలవ్యుడు గురువు ప్రతిమతో విద్య నేర్చుకున్న మహా వీరుడని వక్తలు కొనియాడారు. కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధిలోగల చింతలదిమ్మలో ఎరుకుల వీధిలో ఏకలవ్యుడు విగ్రహాన్ని ఎస్.కోట వైస్ ఎంపిపి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఇందుకూరి సుధారాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ ఏకలవ్యుడు ఏకసంతాగ్రహి అని, గురువు ద్రోణాచార్యుని ప్రతిమతో విద్యను అలంకరించిన ఏకైక వ్యక్తిని కొనియాడారు. ఆయన వారసులగా మనమందరం ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో ఉన్న ఎరుకుల కులస్తులు అందరికీ రిజర్వేషన్



కొత్తవలస: విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎరుకల కులస్తుల రాష్ట్ర నాయకులు పాలపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కొద్దిగా ఉన్న ఎరుకుల కులస్తుల రిజర్వేషన్లు ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. గిరిజన కోటాలో ఎరుకల కులస్తులకు ఉద్యోగ భృతి కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పాలవలస శ్రీను, ఉపాధ్యక్షులు పాలవలస పైడితల్లి, కార్యదర్శి గొర్లె గౌరీ శంకర్ పాల్గొన్నారు.

వైద్యులు రెడ్డి సత్యారావు మృతి

ప్రజాశక్తి-బొబ్బిలి



పట్టణంలో కొన్ని దశాబ్దాలుగా ప్రజలకు వైద్య సేవలందిస్తున్న సీనియర్ వైద్యులు రెడ్డి సత్యారావు (96) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. పట్టణంలో ఆసుపత్రి ఏర్పాటు చేసి పట్టణం, గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించారు. తక్కువ ఫీజుతో నాణ్యమైన వైద్య సేవలు అందించి ఎంతోమంది ప్రాణాలను కాపాడారు. సీనియర్ వైద్యులు రెడ్డి సత్యారావు మరణంతో ప్రజలు దిగ్భ్రాంతికి గురయ్యారు. సత్యారావు మృతికి ఎమ్మెల్యే బేబినాయన, మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు, మాజీ ఎమ్మెల్యేలు తెంటు రాజా, శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శంకరరావు, పట్టణ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. ఆయనకు నలుగురు కుమారులున్నారు. వీరిలో రెడ్డి రవికుమార్, శ్రీనివాసరావు వైద్యులుగా పని చేయగా శేషు అమెరికాలో సాఫ్ట్ వేర్ ఉద్యోగిగా, రెడ్డి ప్రసాద్ బొబ్బిలిలో రియల్ ఎస్టేట్, బిల్డర్‌గా స్థిరపడ్డారు.

ప్రజాధనం వృథా..

- విష సర్పాలకు నిలయంగా సామూహిక మరుగుదొడ్లు
- పట్టించుకోని పాలకులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఆతవ గ్రామంలో ప్రజలు ఆరోగ్యం దృష్ట్యా టిడిపి ప్రభుత్వం హయాంలో అప్పటి గ్రామ సర్పంచ్ సిరికి రామలక్ష్మి చొరవతో సుమారు 30కి పైగా సామూహిక మరుగుదొడ్లు నిర్మించారు. మరుగుదొడ్లు వాడుకునేందుకు వాటర్ సౌకర్యం కూడా కల్పించారు. ఇంతలో సర్పంచ్ పదవి కాలం పూర్తవడం తరువాత వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసుకోవాలని ఉద్దేశంతో ఏకగ్రీవంగా గొంప వేమన రామునాయుడును సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. సుమారు రెండున్నర సంవత్సరాలు కావస్తున్నప్పటికీ ఏకగ్రీవంగా ఎన్నుకున్న సర్పంచ్ మాత్రం సామూహిక మరుగుదొడ్లపై దృష్టి పెట్టలేదు. వాటిని బాగు చేసి వాడుకలోనికి తేవడానికి కృషి చేయకపోవడం పట్ల గ్రామస్తులు



నిరుపయోగంగా ఉన్న సామూహిక మరుగుదొడ్లు

విమర్శిస్తున్నారు. మరుగుదొడ్లు గత రెండున్నరేళ్లగా వాడుకలో లేకపోవడంతో వాటి చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి విష సర్పాలకు నిలయంగా మారాయి. ఇప్పటికైనా గ్రామ సర్పంచ్ పాడైపోయిన మరుగుదొడ్లను బాగు చేసి వాడుకలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రైతు సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి- శృంగవరపుకోట, వేపాడ

దేవాదాయ ధర్మాదాయ భూముల సాగుదారులు, కౌలు రైతులు ఐక్యమై సమస్యలపై చర్చించి పరిష్కరించుకునేందుకు సిద్ధమవ్వాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు పిలుపునిచ్చారు. ఈ నెల 21వ తేదీ శనివారం జిల్లాలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు, కౌల రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే రైతు సదస్సులో అధిక సంఖ్యలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా గురువారం కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం వేపాడ మండలంలోని ముకుందపురం, దబ్బిరాజుపేట, కల్లేపల్లిరేగ, వెంకటరమణపేట, ముసిడిపల్లి, మూలబొడ్డవర గ్రామాల్లో నాయకులు పర్యటించి సదస్సును విజయవంతం చేయాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చల్ల జగన్, రైతు



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మద్దిల రమణ, కల్లేపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లక్కవరపుకోట: మండలంలోని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి. అప్పారావు ఆధ్వర్యంలో సదస్సును జయప్రదం చేయాలని బుధవారం ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి. వెంకటరమణ, బి. రాము, జి. అప్పలస్వామి, ఎస్. చిన్నారావు, జి.సత్యం తదితరులు పాల్గొన్నారు.



ఆటోను ప్రారంభిస్తున్న వైస్ ప్రెసిడెంట్ డిఎన్‌రావు, వీసీ ప్రశాంత్‌కుమార్ మహంతి తదితరులు

ఎలక్ట్రికల్ ఆటో ప్రారంభం

4 గంటల ఛార్జింగ్‌తో 120 కి.మీ ప్రయాణం

ప్రజాశక్తి - నెల్లిమర్ల


సెంచూరియన్ విశ్వవిద్యాలయం రూపొందించిన ఎలక్ట్రిక్ బ్యాటరీ ఆటోను బుధవారం వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డి.ఎన్.రావు, ఆయన సతీమణి పద్మ ప్రారంభించారు. లిథియమ్ ఐయాన్ బ్యాటరీతో నడిచే ఈ ఆటోలో డ్రైవర్‌తో కలిపి 5గురు ప్రయాణించవచ్చని జిటిఇటి సిఇఒ బాబుశంకర్ తెలిపారు. 4 గంటలపాటు బ్యాటరీ ఛార్జి చేస్తే 120 కిలోమీటర్లు వరకు ప్రయాణించవచ్చన్నారు. గతంలో బ్యాటరీతో నడిచే ఆటోలకు స్టీల్ ఉపయోగించగా, వీటిని ఫైబర్‌తో తయారు చేశారు. ఈ ఆటో చూపరులకు అందంగా, సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, ఐక్యూఎసి డీన్ పిఎస్‌వి రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్‌ఎస్ వర్మ, సుమన్, కిశోర్ మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాలపై దృష్టి పెట్టండి

నారా లోకేష్‌ను కోరిన సామాజిక కార్యకర్త

ప్రజాశక్తి- వేపాడ

మండలంలో పెద్ద ఎత్తున జరిగిన భూ కబ్జాలపై దృష్టి పెట్టాలని మండలానికి చెందిన సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు మంత్రి నారా లోకేష్‌ను కోరారు. మంగళవారం ఆయన వెలగపూడి సచివాలయం వద్ద లోకేష్‌ను కలిసి వినతినందించారు. ఈ సందర్భంగా మండలంలో జరిగిన భూ కబ్జాలపై మంత్రికి వివరించారు. మండలంలోని చామలాపల్లి గ్రామంలో షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం భూ అభివృద్ధి పథకం ద్వారా పేదలకు కొని ఇచ్చిన 24 ఎకరాలు భూమిని స్థానిక నాయకులు, రెవెన్యూ అధికారులు కలిపి తప్పుడు రికార్డులు సృష్టించి ఇతర జిల్లా వాసులకి బదలాయించారన్నారు. ఈ విషయంపై పలుమార్లు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సంబంధిత అధికారులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



మంత్రి నారా లోకేష్‌తో రిక్కి అప్పారావు

వేపాడ మండల కేంద్రంలో గల బక్కు నాయుడుపేట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహంలోనూ, కెజిబివిలోనూ, ఎపి ఆదర్శ పాఠశాల వసతి గృహంలోనూ బాలికలకు సౌకర్యాలు కల్పించడంతో పాటు సౌర విద్యుత్తు ఏర్పాటు చేసి బక్కు నాయుడుపేట జంక్షన్ నుంచి అసంపూర్తిగా ఉన్న కిలోమీటర్ రోడ్డును పూర్తి చేయించి బడి బస్సులు రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే వినతి పత్రాన్ని ప్రజా దర్బారులోనూ, విద్యాశాఖ కార్యాలయంలోనూ సమర్పించినట్లు లోకేష్ దృష్టిలో పెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మీరు చెప్పినవన్నీ సామాజిక సమస్యలు కాబట్టి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పినట్లు అప్పారావు తెలిపారు.

మానవ మృగాలను కఠినంగా శిక్షించాలి

హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ సభ్యులు

ప్రజాశక్తి - గరివిడి

ఆరు నెలల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలని ఇలాంటి దురదృష్టకర సంఘటన పునరావృతం కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీదేవి కోరారు. బుధవారం గరివిడిలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రామభద్రపురం మండలంలో ఇటీవల ఆరు నెలల బాలిక ఊయలలో ఉండగా అత్యాచారానికి పాల్పడిన సంఘటన దురదృష్టకరమని అన్నారు. రీజియన్ అధ్యక్షుడు మానాపురం హరీష్ కుమార్, జిల్లా అధ్యక్షుడు వైవి రామ్మోహన్ రావు, ఆర్గనైజింగ్ అధ్యక్షుడు పోలిరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు బి పోలీస్, నియోజకవర్గ అధ్యక్షుడు బి.సూర్యనారాయణ మాట్లాడుతూ తీవ్ర నేరాలకు పాల్పడిన నిందితులకు త్వరితగతిన ఉరిశిక్ష



మాట్లాడుతున్న హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ సభ్యులు

అమలు జరిగితే ఇలాంటి సంఘటనలకు పాల్పడే వారికి తగిన శాస్తి జరిగినట్టు అవుతుందని అన్నారు. హత్యలు, అత్యాచారాలు మద్యం, గంజాయి, నీలిచిత్రాల ప్రభావంతోనే జరుగుతున్నాయన్నది అనేక కేసుల్లో రుజువైందని, అటువంటి వాటిని కూడా నియంత్రించాల్సిన అవసరం ఉందని వారు అన్నారు.

ఉమా ఆశయాలు కొనసాగించాలి

ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ప్రసాద్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కీర్తిశేషులు ఐఎఫ్‌టియు నాయకులు ఉరిటి ఉమా మహేశ్వరరావు ఆశయాలు కొనసాగించాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు పి. ప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఐఎఫ్‌టియు అమర కార్మికుల భవనంలో ఉమామహేశ్వరరావు సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ ఉమా మహేశ్వరరావు చిత్ర పటానికి నివాళులర్పించి మాట్లాడారు. ఉమామహేశ్వరరావు కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం నెల్లిమర్లలో ఐఎఫ్‌టియు స్థాపనకు కృషి చేశారన్నారు. కార్మికుల పక్షాన నిలబడి సమస్యలు పరిష్కరించాలని పోరాటం చేశారని గుర్తు చేశారు. ఆయన భార్య పిల్లలు కూడా కార్మిక ఉద్యమంలో పాల్గొని పోరాటాలు చేశారని కొనియాడారు. సంతాప సభలో ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు గోపాలం, జిల్లా ప్రధాన కార్యదర్శి గీత, సిఐటియు జిల్లా కమిటి సభ్యులు కిల్లంపల్లి రామారావు, నగర



మాట్లాడుతున్న ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ప్రసాద్

పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, టిడిపి నాయకులు కడగల ఆనంద్ కుమార్, లెంక అప్పలనాయుడు, అవనాపు సత్య నారాయణ పాల్గొని నివాళులర్పించారు.

వర్షాకాలంలోనూ తప్పని తాగునీటి కష్టాలు

ప్రజాశక్తి- బొబ్బిలి

వర్షాకాలంలోనూ తాగునీటి కోసం ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. మున్సిపాలిటీలో తాగునీరు కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తారకరామ కాలనీ, పాతబొబ్బిలి, గొల్లపల్లి ప్రాంతాలకు సంపూర్ణంగా తాగునీరు అందకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి కుళాయిలు గోతులలో ఉండడంతో వర్షం కురిస్తే నీరు కలుషితమవుతుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజు తప్పించి రోజు తాగునీరు సరఫరా చేస్తున్నా పూర్తి స్థాయిలో సరఫరా చేయకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు వాపోతున్నారు. వర్షాకాలంలో కూడా తాగునీటి కోసం అవస్థలు పడాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని టిడిపి, వైసిపి నాయకులను, ప్రజాప్రతినిధులను, మున్సిపల్ అధికారులను



నీటి కోసం బిందెలతో వేచి ఉన్న మహిళలు

కోరుతున్నా పట్టించుకోవడం లేదని మహిళలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

డైట్‌లో 'అమ్మపేరిట ఒక మొక్క'

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణా సంస్థ (డైట్)లో అధ్యాపకులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 'అమ్మ పేరు మీద ఒక మొక్క' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రతి ఒక్కరూ తన తల్లి పేరు మీద ఒక మొక్కను నాటాలని తద్వారా భూమి పై హరిత వనాన్ని అభివృద్ధి చేయవచ్చునని అధ్యాపకులు చెప్పారు. ఈ కార్యక్రమం గురించి సమాచారం అందుకున్న కేంద్రప్రభుత్వ 'మినిస్టరీ ఆఫ్ ఎన్విరాన్మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్' ఆయా ఫోటోలను తమ ట్విట్టర్‌లో పొందుపరిచి శు



మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

భాకాంక్షలు తెలిపినట్లు అధ్యాపకులు చెప్పారు. ఈ మదర్స్ గార్డెన్ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ తిరుపతినాయుడు, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ కె.రామకృష్ణారావు, ఇతర భోధన, బోధనేతర సిబ్బంది, పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలో క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి- బొబ్బిలి

జిల్లా స్థాయి తైక్వాండో పోటీలలో బొబ్బిలి క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఈనెల 14న విజయనగరంలో జిల్లా స్థాయి పోటీలు జరిగాయి. పోటీలలో 13మంది బంగారు, 16మంది రజిత, 19మంది కాంస్య పతకాలు సాధించినట్లు కోచ్ బంకురు ప్రసాద్ చెప్పారు. తైక్వాండోలో ప్రతిభ కనబరిచేలా శిక్షణ ఇస్తున్నట్లు ప్రసాద్ చెప్పారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎమ్మెల్యే బేబినాయన అభినందించారు. క్రీడలలో విద్యార్థులు, యువత రాణించాలని బేబినాయన కోరారు.

చదరంగంతో మంచి విజ్ఞానం

చదరంగంతో విజ్ఞానాన్ని పెంచుకొవచ్చునని చెస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక శ్రీదాడితల్లి కాలనీలో శ్రీపక్యా బుధవారం అండర్-7 జిల్లా చెస్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. జిల్లా స్థాయి పోటీలకు బాలుర విభాగంలో కె.నాగదేవాన్ష్, ఆకుల హిమాంక్ శశ్వత్, బాలికల విభాగంలో ఎన్. ధన్విక, బి. అనన్య ఎంపికైనట్లు కోచ్ ఎం.గణేష్ చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జి.నర్సింగరావు, కిరణ్, గౌతమ్, గణేష్ పాల్గొన్నారు.

శృంగవరపు కోట: పట్టణంలోని ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న పంపాన మౌనికకు మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన కాపు గంటి తాతాజీ రూ.5వేలు విలువైన బ్యాడ్మింటన్ రాకెట్‌ను బుధవారం అందజేశారని కోచ్ శ్రీరాములు తెలిపారు.

నేడు గ్రీవెన్స్

బొబ్బిలి: స్థానిక పాతకోట ఆవరణలో ఉన్న మాజీ సైనిక ఉద్యోగుల సంఘం కార్యాలయంలో గురువారం ఉదయం 10గంటలకు గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు మాజీ సైనిక ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఆర్.కిరణ్ కుమార్ చెప్పారు. ఆర్మీ ఉద్యోగులు, మాజీ సైనికులు, మాజీ సైనికుల కుటుంబ సభ్యులకు ఎటువంటి సమస్యలు ఉన్న గ్రీవెన్స్‌లో అర్జీ పెట్టుకోవాలన్నారు. జిల్లా సైనిక సంక్షేమ బోర్డు అధికారి సత్యప్రసాద్ వినతులు స్వీకరిస్తారని చెప్పారు.


నేడు మండల సమావేశం

శృంగవరపుకోట: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామని ఎంపిడిఒ సాంబమూర్తి తెలిపారు. ఈ సమావేశానికి ఉదయం 10 గంటల కల్లా అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

అభివృద్ధిపై మంత్రితో ఎమ్మెల్యే చర్చ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మంగళగిరి టిడిపి కార్యాలయంలో బిసి సంక్షేమ, చేనేత శాఖ మంత్రి ఎస్.సవితమ్మని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి బుధవారం కలిసి నియోజకవర్గం అభివృద్ధిపై చర్చించారు. తమ నియోజకవర్గంపై దృష్టి పెట్టాలని ఆమెను కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, మాజీ జెడ్‌పిటిసి కరెడ్ల ఈశ్వరరావు, వెలమ సాధికార సమితి కన్వీనర్ లాలం అర్జున్‌రావు, యేడువాక గణేష్, గోగాడ జగన్నాధం నాయుడు, ఐటిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చీపురుపల్లి సాగర్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రితో ఎమ్మెల్యే లలితకుమారి